మేయర్‌తో మాజీ మంత్రి భేటీ

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ సురేష్ బాబుతో మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

నర్సింగ్ విద్యార్థికి ఆర్థికసాయం

కడప కల్చరల్ : కడపలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాల విద్యార్థిని చింతమాను మౌనికకు వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం కళాశాలలో ఆ విద్యార్థినికి రూ. 21 వేలను చెక్కు రూపంలో అందజేశారు.

సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి

కడప అర్బన్/ కడప కల్చరల్: పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. కడప నగరంలోని చిన్నచౌక్‌లో వున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం బాసట స్వచ్ఛంద సేవాసంస్థ సహకారంతో పిల్లలకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కోదండ రామాలయ ధర్మకర్త వెంకట్‌రెడ్డి, బాసట స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాబార్డు జిల్లా అధికారి విజయ విహారి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంజీవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి ఫౌండేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వెన్నపూసకు మద్దతివ్వండి

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతివ్వాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కోరారు. శుక్రవారం బిల్టప్ సమీపంలోని వెంకటసాయి కళ్యాణ మండపంలో ఎన్నికల ప్రచార పత్రాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. **వీరపునాయునిపల్లె :** ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

విశేష పూజలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరులోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలోని శివాలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఉదయం స్వామి వార్లకు అభిషేకాలు, హోమం, గణపతి పూజతో పాటు పలు పూజ కార్యక్రమాలను చేపట్టారు.

గృహసారథులే జగనన్న సైన్యం



గృహ సారథులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే జగనన్న సైన్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక బిల్టప్ సమీపంలోని వెంకటసాయి కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన భవిష్యత్, భావి తరాల భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన తర్వాత మార్చి 18వ తేది నుంచి 24వ తేది వరకూ ఏడు రోజుల పాటు 'జగనన్నే మన భవిష్యత్' పేరుతో మనం ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. ప్రతి కుటుంబంతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించాలన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ముద్రించిన కరపత్రాలను వారికి ఇవ్వడంతోపాటు, గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలు గుర్చి వివరించాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేసి, చదువు రాని వారికి చదివి వినిపించాలన్నారు. ఒక క్లస్టర్‌కు 70 ఇళ్లు వస్తాయనుకుంటే ఒక్కో గృహసారథి రోజుకు పది ఇళ్లు చొప్పున ఏడు రోజుల్లో 70 ఇళ్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఎంత మంచి చేస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా విషం చిమ్ముతున్నాయన్నారు. లోకేష్ పాదయాత్రకు ఆదరణ కరువైందని, అందుకే ఫ్రస్టేషన్‌తో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, పార్టీ నాయకులు అహమ్మద్ బాషా, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్‌వలీ, హఫీజుల్లా, చల్లా రాజశేఖర్, వి. రామక్రిష్ణారెడ్డి, జి. శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దర్గా స్థలం ఆక్రమణ అసత్యం

– స్పష్టం చేసిన దర్గా కమిటీ



మాట్లాడుతున్న దర్గా కమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలోని హజరత్ రఖీబ్ షావలీ దర్గా స్థల ఆక్రమణకు గురవుతోందని కొందరు వ్యక్తులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని, ఏ ఆధారాలు లేకుండా కేవలం గ్రూపులను రెచ్చగొడుతూ అశాంతిని రేకెత్తిస్తోందని కమిటీ కార్యదర్శి ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు ఎస్ఎండీ హనిఫ్, ఖాదర్‌బాషలు స్పష్టం చేశారు. శుక్రవారం దర్గా ఆవరణలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1956లో రఖీబ్‌షావలీ దర్గాకు 20 సెంట్ల స్థలం ఇచ్చినట్లు రికార్డుల్లో ఉందన్నారు. ప్రతి దర్గాకు ఉరుసు జరుపుకునేందుకు కొంత స్థలం తప్పక ఉంటుందన్నారు. అలాగే 1952లో రామకృష్ణ సమాజం వారు విద్యార్థుల మైదానానికి స్థలం కేటాయించాలని డీఈఓ ద్వారా ప్రభుత్వాన్ని కోరగా, ప్రభుత్వం వారికి భూ సేకరణ చేసి స్థలం కేటాయించినట్లు, దానికి రామకృష్ణ సమాజం వారు డబ్బులు చెల్లించినట్లు ఆర్డీఓ, డీఈఓల వద్ద రికార్డులు ఉన్నాయన్నారు. మిగతా వాటికి సంబంధించి ఇది దర్గా స్థలం అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. ఈ సమావేశంలో దర్గా కమిటీ సభ్యులు చాంద్‌బాష, అన్వర్ హుసేన్, పఠాన్ ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

– కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి



కడప అర్బన్: కడప నగరం మోచంపేటలో రామకృష్ణ జూనియర్ కళాశాల యాజమాన్యానికి, సమీపంలోని రఖీబ్ షా దర్గా కమిటీవారికి మధ్య స్థలానికి సంబంధించిన సమస్య జరుగుతోందని, ఈక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రతా ఏర్పాట్లను నిర్వహిస్తున్నామని కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి తెలియజేశారు. శుక్రవారం మధ్యాహ్నం సంఘటన స్థలం వద్ద మీడియాతో డీఎస్పీ మాట్లాడారు. కొందరు ఆందోళన కారులు సంఘటనాస్థలానికి వచ్చేందుకు ప్రయత్నించారని వారిని ముందస్తు అరెస్టులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని బందోబస్తు విధులను పకడ్బందీగా నిర్వహించారు.

వాహనాల తనిఖీ

కడప అర్బన్: జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 65 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 55 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహనడ్రైవర్లకు 10 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు.

బాలుడు అదృశ్యం

కడప అర్బన్: కడప వైఎస్ఆర్ కాలనీలో నివాసం వుంటున్న సయ్యద్ నజీరుద్దీన్ తన చిన్న కుమారుడు రఖీముద్దీన్ (07) అనే బాలుడు ఈనెల 16వ తేదీ ఇంటిదగ్గర పిల్లలతో ఆడుకుంటూ తప్పిపోయాడని, రాత్రి 7 గంటలైనా ఇంటికి రాలేదని చిన్నచౌక్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాలుడి తల్లిదండ్రులు, బంధువులు అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో చిన్నచౌక్ ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కు రోడ్, రాయచోటి అండర్ బ్రిడ్జి పార్కు, రామరాజుపల్లె, పాతకడప, ఎన్‌జీవో కాలనీ హెల్త్ సెంటర్ల నిర్మాణాలను పరిశీలించారు.



సూచనలు ఇస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

మొక్కల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శుక్రవారం స్థానిక హైస్కూలు విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసింది. సంస్థ స్పెషల్ ఆఫీసర్, స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ ఆదేశాల మేరకు సంస్థ సభ్యులు స్థానిక చిన్నచౌకు జయనగర్ కాలనీలోని జెడ్పీ హైస్కూలులో దాదాపు 500 మొక్కలను ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేశారు.

అన్నదానం

కడప కల్చరల్ : స్థానిక ఇందిరానగర్‌లోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం దాతలు అన్నదానం నిర్వహించారు. కడప నగరం ఆర్టీసీ కాలనీకి చెందిన సింగం నాగసులోచన, చంద్ర ఓబుల్‌రెడ్డి కుమారుడు లక్ష్మీ రోహిత్ రెడ్డి ద్వితీయ జన్మదినాన్ని పురస్కరించుకుని వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.